క్లుప్తంగా

బస్టాండు నిర్మించాలని వినతి



మదనాపురం: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండు నిర్మాణం చేయాలని కోరుతూ బుధవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో వ్యాపార రవాణా పరంగా ఈ ప్రాంతం ఎంతో ప్రధాన్యత కలిగిందని పేర్కొన్నారు. పాలకులు, అధికారులు స్పందించి సత్వరమే నిధులు మంజూరు చేయించి, బస్టాండు నిర్మాణం ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాబుగౌడ్, కిశోర్, రాము, అంజన్‌కుమార్ యాదవ్, శివ, బాలచంద్రి, రాము తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు సరికాదు



ఆత్మకూర్: దళితులపై రోజురోజుకూ దాడులు పెరుగుతూనే ఉన్నాయని, దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షిస్తేనే బాధితులకు న్యాయం జరుగుతుందని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని నందిపహాడ్‌లో దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాబర్ట్, ప్రసాద్, రాజు, మశప్ప, వెంకటయ్య, విజయ్, శ్రీను తదితరులు ఉన్నారు.

లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు



గోపాల్‌పేట: ప్రతి ఒక్కరూ 'సేఫ్ టచ్ అన్‌సేఫ్ టచ్'పై అవగాహన కలిగి ఉండాలని, ఎవరికైనా ఏదైనా ఇబ్బంది కలిగితే పోలీసులకు, 1098 నంబర్‌కు లేదా వారి పెద్దలకు సమాచారం అందించే విధంగా ప్రతి ఒక్కరూ సిద్ధపడాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు రాంబాబు, లక్ష్మమ్మ అన్నారు. బుధవారం వారు మండలంలోని పొలికెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లైంగిక నేరాలపై అవగాహన కల్పించారు. బాలల లైంగిక నిషేధ చట్టంతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం చైల్డ్‌లైన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రజని పాల్గొన్నారు.

ఇటుక బట్టీలు అక్రమంగా నిర్వహించొద్దు



మదనాపురం: మండలంలోని దంతనూరు, తిర్మలాయపల్లి సమీపంలో ఉన్న ఇటుక బట్టీలను బుధవారం వనపర్తి ఆర్డీఓ పద్మావతి పరిశీలించారు. అనుమతులు లేకుండా బట్టీలు నిర్వహించొద్దని సూచించారు. అనుమతులు లేని వారు సత్వరమే అనుమతులు తీసుకోవాలని, బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని ఆదేశించారు. ఇటుక బట్టీల నుంచి వచ్చే దుమ్ము, ధూళితో రోడ్డు మార్గంలో వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా సైడ్ వాల్స్ కట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, డీటీ అశోక్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

'ఖిల్లా'ఎస్‌ఐగా శ్రీహరి

ఖిల్లాఘనపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా కె.శ్రీహరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఖిల్లాఘనపురం ఎస్‌ఐగా 22 నెలల పాటు విధులు నిర్వహించిన వెంకటేష్‌గౌడ్ ఇటీవల బదిలీపై వనపర్తి సీసీఎస్‌కు వెళ్లారు. గద్వాల జిల్లాలో వీఆర్‌లో ఉన్న శ్రీహరి ఖిల్లాఘనపురం మండలానికి బదిలీపై వచ్చారు. బుధవారం బదిలీపై వెళ్లిన వెంకటేష్‌గౌడ్ నూతన ఎస్‌ఐకి బాధ్యతలు అప్పగించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని, పోలీసు శాఖ ద్వార ప్రజలకు పూర్తి భరోసా ఇస్తామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ తెలిపారు.

గోపాల్‌పేట: రేవల్లి మండల ఎస్‌ఐగా బుధవారం శివకుమార్, రేవల్లిలో విధులు నిర్వహించిన మల్లేష్ గోపాల్‌పేట ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.



బిల్లుల చెల్లింపులో జాప్యం



శాగాపూర్‌తండాలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడామైదానం

- క్రీడా ప్రాంగణాలు పూర్తయి ఏడాది గడిచినా అంతే..
- బిల్లుల కోసం సర్పంచ్‌లకు తప్పని ఎదురుచూపులు
- జిల్లా అధికారులు స్పందించాలని వినతి

పాన్‌గల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. వీటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సర్పంచ్‌లు అప్పులు చేసి పనులు పూర్తి చేశారు. తీరా పనులు పూర్తై ఏడాది గడిచినా బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తుండడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. బిల్లుల జాప్యంపై పలు మార్లు సర్వసభ్య సమావేశాల్లో నిరసనలు, జిల్లా అధికారులకు, నియోజకవర్గ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకవెళ్లినా, వినతిపత్రాలు ఇచ్చిన సమస్య పరిష్కారం కాలేదని మండల సర్పంచ్‌లు ఆవేదన చెందుతున్నారు.

మండల పరిస్థితి ఇలా..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో పనులు పూర్తయినా బిల్లులు అందలేదు. ఆయా జీపీల్లో చేపట్టే క్రీడా మైదానాలకు సగటున రూ.1.70 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. తక్కువ జనాభా ఉన్న జీపీల్లో రూ.లక్ష నుంచి రూ.1.20లక్షలుగా నిర్ణయించారు. క్రీడా మైదానాలు పూర్తి చేసినట్లు కొన్ని జీపీల్లో బోర్డులు పెట్టినా మైదానాల్లో ఆటలు ఆడుకునేందుకు అవసరమైన క్రీడా సామగ్రిని అందుబాటులో ఉంచలేదు. దీంతో పేరుకే క్రీడా మైదానాలు తప్పా ఆటలకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని గ్రామాల్లో యువత విమర్శిస్తున్నారు.

తక్కువ స్థలాల్లోనే మైదానాలు

క్రీడా మైదానాలు ఎకరం స్థలంలో ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా.. స్థలాల కొరతతో తక్కువ స్థలాలు, పాఠశాలల ఆవరణల్లోనే వీటిని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా శాగాపూర్‌తండా, వెంగళాయిపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, మంగళ్లపల్లి, బహుదూర్‌గూడెం వంటి గ్రామాల్లో అతి తక్కువ స్థలాల్లోనే మైదానాలు ఏర్పాటు చేశారు.

అప్పులు చేసి పనులు చేపట్టినం



ప్రతి జీపీలో క్రీడా మైదానం ఏర్పాటు చేసే విషయంలో అధికారుల ఒత్తిడి కారణంగా అప్పులు చేసి పనులు చేసినం. ఏడాది గడుస్తున్నా నేటికీ బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నాం. పనులు చేసే సమయంలో త్వరగా పూర్తి చేయాలని అంటున్న అధికారులు బిల్లుల విషయంలో అదే చొరవ తీసుకోవాలి.

– శాంతమ్మ, సర్పంచ్, తెల్లరాళ్లపల్లితండా

ఇబ్బందులు తప్పడం లేదు



క్రీడా మైదానాల పనులను త్వరగా పూర్తి చేయండి. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అందుతాయని చెప్పిన అధికారులు నేడు బిల్లుల చెల్లింపులో జాప్యం ప్రదర్శిస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా చేసిన పనులకు బిల్లులు త్వరగా విడుదల చేసి ఇబ్బందులు తొలగించాలి.

– అంజనేయులు, సర్పంచ్, మంగళ్లపల్లి

ప్రతిపాదనలు పంపించాం



క్రీడా మైదా నం బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. మండలంలో పనులు పూర్తి చేసి న జీపీల బిల్లులను జిల్లా అ ధికారులకు నివేదించాం. బిల్లులు మంజూరైన వెంటనే జీపీ ఖాతాల్లో జమ చేస్తాం. కొన్ని జీపీల్లో స్థలాల కొరతతో ఉన్న స్థలంలోనే మైదానాలు ఏర్పాటు చేశాం. మైదానాల్లో క్రీడాకారులు ఆడుకునేలా సామగ్రిని ఏర్పాటు చేయిస్తాం

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి

పాన్‌గల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బహుదూర్‌గూడెంలో రూ.20 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రతి జీపీకి రూ.20 లక్షలు మంజూరు చేయించారని ఆయన పేర్కొన్నారు. సీసీ లేని ప్రతి కాలనీలో సీసీ నిర్మాణాలను చేపడతారని తెలిపారు. ఆయా నిర్మాణాలను నిబంధనల మేరకు నాణ్యతగా నిర్మించాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణునాయుడు, దావాత్‌ఖాన్‌పల్లి సర్పంచ్ నాగేష్‌నాయుడు, మంగళ్లపల్లి సర్పంచ్ ఆంజి, పీఆర్ ఏఈ సత్తయ్య, పంచాయితీ కార్యదర్శి హరిత, బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతయ్యనాయుడు, రవికుమార్ రెడ్డి, నవీన్‌రెడ్డి, రాజు, హన్మంతు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ డాకేశ్వర్‌గౌడ్

వీపనగండ్ల: యాసంగిలో మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు దాదాపు 8వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారని యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చని మండల వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం వల్లభాపురం శివారులో సాగు చేసిన వరి పంటలను ఆయన పరిశీలించారు. చలి తీవ్రత వల్ల వరి పంటకు కుళ్లు తెగులు, అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగు తదితర తెగుళ్లు వ్యాపిస్తాయని, వీటి నివారణ కోసం వ్యవసాయాధికారుల సూచనలను రైతులు పాటించాలని ఆయన కోరారు. వరి నాటిన 15 నుంచి 20 రోజుల్లో కార్బండిజం, మ్యాంకోజెబ్స్ మిశ్రమాన్ని చల్లడం వల్ల కాండం కుళ్లు తెగులు నివారించుకోవచ్చన్నారు. కాండం తొలుచు పురుగు నివారణ కోసం కార్బోఫ్యూరాన్ లేదా కార్బన్ హైడ్రోక్లోరైడ్ మిశ్రమాన్ని పంట పొలాల్లో చల్లాలన్నారు. చలి తీవ్రత వల్ల వ్యాపించే తెగుళ్లను నివారించేందుకు మ్యాంకోజెబ్ లేదా ట్రైసైక్లోజోన్ మందును పిచికారీ చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. వీటితో పాటు తొలిదశలో వరికి ఈగ ఆశించి పంటను నాశనం చేస్తుందని, వాటి నివారణకు క్లోరోపైరిఫాస్ 50ఈసీ మందును పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు. శాస్త్రీయ పద్ధతులు అవలంబించడం వల్ల తక్కువ ఖర్చుతో రైతులు వరిపంటకు ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణను సులభంగా చేసుకోవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విజయగౌడ్, గ్రామ రైతు కోఆర్డినేటర్ ప్రతాప్‌రెడ్డి, రైతులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు మాతృత్వం గొప్ప వరం



గర్భిణులకు వడి నింపుతున్న తహసీల్దార్ సింధూజ, చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: మాతృత్వం మహిళలకు గొప్ప వరమని, గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని తహసీల్దార్ సింధూజ, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ రమేష్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో కౌన్సిలర్ చెన్నయ్య ఆధ్వర్యంలో 20 మంది గర్భిణులకు సీమంతం చేశారు. ప్రతినిత్యం పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలను పాటించి పండంటి బిడ్డకు జన్మనివ్వాలన్నారు. అనంతరం వారికి పౌష్టికాహారం అందజేసారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కుర్వ రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, మోసీన్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రహదారి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు



సీసీ పనులను అడ్డుకున్న చేగువేరా యూత్ నాయకులు

అమరచింత: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ ఇష్టానుసారంగా రహదారి పనులు చేస్తున్నారంటూ చేగువేరా యూత్ ఆధ్వర్యంలో బుధవారం పనులను అడ్డుకున్నారు. ఈసందర్భంగా చేగువేరా యూత్ నాయకులు రాఘవేంద్ర, చంటి మాట్లాడుతూ పట్టణంలో రూ.3.5లక్షలతో ఆయా వార్డుల్లో సీసీ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఇసుకకు బదులు డస్ట్‌ను ఉపయోగించి సీసీ రహదారి పనులు చేస్తున్నాడని ఆరోపించారు. సిమెంట్, కంకర, ఇసుక పరిమాణాలు సమపాళ్లలో ఉండాలని తెలిపారు. ఇసుకను కాదని డస్ట్‌తో పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటి వరకు పట్టణంలోని ఆయా వార్డుల్లో గతంలో ఉన్న సీసీ రహదారులు మిషన్ భగీరథ తవ్వకాల మూలంగా గుంతలమయం అయ్యిందని, ఇప్పుడు వేస్తున్న రోడ్డు అయిన పదికాలాల పాటు ఉంటుందన్న నమ్మకం ప్రజల్లో లేదన్నారు. మున్సిపల్ ఏఈ పర్యవేక్షణ లేకుండా రహదారి పనులు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. అధికారులు స్పందించి సీసీ రహదారి పనులు నాణ్యతగా చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన

పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన సాగాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని కిష్టాపూర్‌తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. తొలిమెట్టు ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మురళీ, సీఆర్‌పీ గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



పామిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

పాన్‌గల్: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగును అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు పాన్‌గల్, బుసిరెడ్డిపల్లి, వెంగళాయిపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన కంటి వెలుగులో 465 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. వీరిలో 31 మందికి కంటి అద్దాలు, 23 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. గురువారం రోజు మండలంలోని కేతేపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, వైద్య సిబ్బంది సంతోషమ్మ, సతీష్, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

166 మందికి..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని వెంకటాపురం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 166 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో 17 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశామని, 28 మందికి అద్దాల తయారీకి పంపిచామన్నారు. 10మందిని ఆపరేషన్ అవసరం ఉన్న వారిగా గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్‌ఎం అనురాధ, వరలక్ష్మి, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: మండలంలో ఈర్లదిన్నెలోని కంటివెలుగు శిబిరాన్ని బుధవారం జిల్లా పంచాయతీ అధికారి సురేష్ పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, హెల్త్‌సూపర్‌వైజర్ వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని పామిరెడ్డిపల్లి రైతు వేదిక ఆవరణలో ఐదో రోజు కంటి వెలుగు శిబిరాన్ని కొనసాగిస్తున్నామని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆప్తాలమిస్ట్ రామకృష్ణ, ఏఎన్‌ఎం కౌసల్య, జ్యోతి, లక్ష్మి తదితరులు తెలిపారు.

300 మందికి..

ఖిల్లాఘనపురం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని కర్నెతండాలో 136 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 25 మందికి అద్దాలు పంపిణీ చేశామని డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా 26 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించామన్నారు. కమాలోద్దీన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలోని మామిడిమాడలో మొత్తం 164 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 9 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని డాక్టర్ సౌజన్యలత తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్‌రెడ్డి, మక్బూల్ పాష తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గోపాల్‌పేట: మండల కేంద్రంలో బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం అయిందని తహసీల్దార్ సునీత తెలిపారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించారని సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం 35 మంది రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతి యాదవ్, వైస్ ఎంపీపీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

మహిళ అదృశ్యం: కేసు నమోదు

పెబ్బేరు: మండలంలోని కొత్త సూగూర్‌కు చెందిన జూదం లక్ష్మి అదృశం అయిందని ఆమె భర్త బాలకిష్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూగూర్‌కు చెందిన లక్ష్మి జనవరి 18వ తేదీన ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటికి తిరిగి రాలేదన్నారు. బంధువులు, తెలిసినా వారి ఇళ్లల్లో వెతికినా ఎక్కడ ఆచూకీ దొరకలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళ ఆచూకీ తెలిస్తే ఫోన్ నంబర్ 94407 95729కు లేదా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

మహా పడిపూజ



అమరచింత: పట్టణంలో బుధవారం కనులపండువగా శివ మహాపడి పూజ కార్యక్రమం కొనసాగింది. గురుస్వామి కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెల్లవారుజామున శివ మాలధారులు పవిత్ర నదీ జలాలను జల్దీ బిందెలతో తీసుకొచ్చి శ్రీకృష్ణనగర్‌లోని శివాలయంలో శివలింగాలను అభిషేకించారు. పట్టణ పుర వీధుల గుండా భక్తిశ్రద్ధలతో శివ మాలధారులు పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి జంగం జగదీష్ ఆధ్వర్యంలో శివ మహా పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కరపత్రాల విడుదల

అమరచింత: ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం పాంరెడ్డిపల్లిలో ఆసంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, మోహన్, నరసింహ, రాజు, మల్లేష్, మహమూద్,శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

వనపర్తి క్రైం: ప్రధాని మోదీ హయాంలో చేపట్టిన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వాటి అమలుకు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10నుంచి 25వరకు వనపర్తి నియోజకవర్గంలో 70 శక్తి కేంద్రాల కార్నల్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం వనపర్తికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి వస్తున్నారని, కార్యకర్తలు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, సబ్బిరెడ్డి, నారాయణ, రామ్మోహన్, బచ్చురాం, శ్రీనివాస్‌గౌడ్, సీతారాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో టెక్నికల్ అసిస్టెంట్‌కు గాయాలు



పాన్‌గల్‌లో బోల్తాపడిన కారు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)గా విధులు నిర్వహిస్తున్న పద్మ బుధవారం రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ప్రత్యక్ష సాక్షులు, కార్యాలయం సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. విధుల నిమిత్తం వెంగళాయిపల్లికి స్కూటీపై వెళ్తున్న క్రమంలో పాన్‌గల్ ప్రాథమిక పాఠశాల సమీపంలో కోతుల గుంపు అడ్డురావడంతో వాహనం అదుపు తప్పి కిందపడటంతో తలకు బలమైన గాయమైందన్నారు. అటుగా వెళ్తున్న వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్ సమాచారాన్ని ఏపీఓకు చేరవేసి ఆమెను అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఏపీఓ కుర్మయ్య ఆస్పత్రికి చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీసి ఆమెను పరామర్శించారు. ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ సిటీ న్యూరో సెంటర్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

కారు బోల్తా: తప్పిన ప్రమాదం

మండల కేంద్రంలోని ఈదమ్మ గుడి సమీపంలో బుధవారం సాయంకాలం కారు బోల్తా పడిన సంఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిక్కేపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ప్రకాష్‌రెడ్డి వనపర్తి నుంచి చిక్కేపల్లికి వెళ్తున్న క్రమంలో ఈదమ్మ గుడి సమీపంలో మలుపు వద్ద కోతి అడ్డురావడంతో అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకుపోయి బోల్తాపడింది. ఈ సంఘటనలో కారులో ఉన్న ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలిసిన వెంటనే చిక్కేపల్లి సర్పంచ్ బాలస్వామియాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు ధనుంజయ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరామర్శించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



అవగాహన కల్పిస్తున్న అధ్యాపక బృందం

పాన్‌గల్: ప్రైవేట్ కళాశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యను అభ్యసించాలని పాన్‌గల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి అన్నారు. బుధవారం మండలంలోని కేతేపల్లి, చిక్కేపల్లి ఉన్నత పాఠశాలలను కళాశాల అధ్యాపక బృందంచే సందర్శించి పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లోనే అడ్మిషన్లు పొందాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య, శిక్షణ పొందిన అధ్యాపక బృందం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు, విశాలమైన తరగతి గదులు, క్రీడా ప్రాంగణం, సైన్స్ విద్యార్థులకు ల్యాబ్‌లు, కంప్యూటర్ విద్య, ఉచిత ఎంసెట్ తరగతులు, స్టడీ అవర్స్ వంటి వసతులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం వెంకట్‌రెడ్డి, సలాంపాష, బాలనాగరాజు, ఆనంద్, కురుమూర్తి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న చెరుకు రైతులు

అమరచింత: క్రిష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు తరలిస్తున్న రైతులకు అన్ని విధాలుగా ఆదుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్‌కు బుధవారం వినతిపత్రం అందించామని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న తెలిపారు. కృష్ణవేణి చెరుకు పరిశ్రమకు రైతులు చెరుకును తరలిస్తున్న సమయంలో లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్లు, లారీలను ఆర్‌టీఏ అధికారులు అడ్డగించి ఇబ్బందులు పెడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే చెరుకు కోతలు ఆలస్యమైందని ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలు వెళితే చెరుకు తరలించడం కష్టమవుతుందన్నారు.

ఆర్టీఏ అధికారులకు..

చెరుకు తరలిస్తున్న వాహనాలను అడ్డుకోకుండా రైతు ప్రయెజనాలను కాపాడాలంటూ ఆర్టీఏ అధికారులు కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. పండించిన చెరుకు ఫ్యాక్టరీకి తరలించడం కోసం ఇతర ప్రాంతాల నుంచి వాహనాలను అద్దెకు తీసుకొచ్చామని, చెరుకు రవాణా వ్యవహారంలో రైతులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వాసారెడ్డి, నరసింహులు, ఆంజనేయులు, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శివుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఆత్మకూర్: వనపర్తి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తేజస్ నందలాల్ పవార్‌ను ఆత్మకూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ కలెక్టరేట్‌లో కలిసి మొక్కను బహూకరించారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని అభ్యర్థించారు. త్వరలోనే ఆత్మకూర్‌లో పర్యటిస్తానని, అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని కలెక్టర్ పేర్కొన్నట్లు వారు తెలిపారు.

'కార్యకర్తలకు వెన్నంటి ఉంటాం'



లక్ష్మణ్‌సింగ్ భౌతికదేహానికి నివాళులర్పిస్తున్న నాగరాజ్‌గౌడ్

అమరచింత: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు వెన్నంటి ఉంటూ వారి కష్టసుఖాలలో భాగస్వాములవుతామని పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ అన్నారు. మండలంలోని మస్తీపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్, మానస దంపతులపై కొందరు ఉద్దేశపూర్వకంగా దాడి చేసి గాయపర్చడమే కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. పోలీసులు నిజనిజాలను తెలుసుకొని తమ కార్యకర్త ఇంటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. ప్రభుత్వాలను ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

లక్ష్మణ్‌సింగ్ మృతి పార్టీకి తీరని లోటు

పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మణ్‌సింగ్ మృతి పార్టీకి తీరని లోటని టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని లక్ష్మణ్‌సింగ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మణ్‌సింగ్ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, అరుణ్‌కుమార్, మహంకాళీ విష్ణు, జుబేర్, విష్ణువర్ధన్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.